ఎలగందల్ టైమ్స్
సంపుటి: 02
సంచిక: 296
ప్రతి అక్షరం ప్రజల కోసం..
తెలుగు దినపత్రిక | కరీంనగర్ | మంగళవారం 29, ఏప్రిల్ 2025



హుస్నాబాద్ మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నేత, న్యాయవాది కన్నోజు రామచంద్రం ఇటీవల మరణించగా ఆయన కుటుంబాన్ని సోమవారం మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, నేతలు మల్లికార్జున్ రెడ్డి, గాల్ రెడ్డి, శ్యామ్ సుందర్, వికాస్ తదితరులు పరామర్శించారు. రామచంద్రం హుస్నాబాద్ కోసం సేవలను గుర్తు చూసుకొని కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.




2

# రసాభాస

## పొన్నంను టార్గెట్ చేసిన పురుమల్ల

## అడ్డుకున్న పొన్నం అనుచరులు

## తీవ్ర వాగ్వాదం.. తోపులాటతో గందరగోళం..

## ఏఐసీసీ నేత సమక్షంలోనే వివాదం

**అరుపులు.. కేకలు.. తోపులాటలు.. బండ బూతులు.. పరస్పర విమర్శలు.. ప్రతి విమర్శలు.. సవాళ్ళు.. ప్రతి సవాళ్ళు.. ఇది జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా భావించిన సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం సోమవారం ఏర్పాటు చేసిన సమావేశం జరిగిన తీరు. సాక్షాత్తు ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్ చార్జి విశ్వ నాథన్ సమక్షంలోనే కాంగ్రెస్ పార్టీ గ్రూపు రాజకీయాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ పై కరీంనగర్ అసెంబ్లీ ఇన్ చార్జి పురుమల్ల శ్రీనివాస్ మరోసా రి పేరు ప్రస్తావించకుండా పరోక్షంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వివాదానికి దారి తీసింది. ఒకటికి నాలుగుసార్లు తనదైన శైలిలో పొన్నంపై ఆరోపణలు గుప్పిస్తుండటంతో జీర్ణించుకోలేని పొన్నం అనుచరులు పెద్ద ఎత్తున పురుమల్లపై దాడికి దిగేందుకు సిద్ధం కావడంతో సమావేశం రసాభాసగా మారింది. నేతలు, కార్యకర్తల మధ్య అరుపులు, కేకలు వెరసి తోపులాటకు దారి తీసింది. సుమారు రెండు గంటల పాటు ఏం జరుగుతున్నదో కూడా ఎవరికీ అర్థం కాకుండా పోయింది.**

- కరీంనగర్, ఎలగందల్ టైమ్స్

పార్టీ సంస్థాగత నిర్మాణ ప్రక్రియలో భాగంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం రసాభాసగా మారింది. గ్రామ, మండల, బ్లాక్, జిల్లా పార్టీ అధ్యక్ష ఎన్నికకు సంబంధించి సూచనలు, సలహాలు అందించాల్సిన సమావేశం ఆద్యంతం దారి తప్పింది. పలువురు నేతలు పార్టీ నాయకత్వ తీరును తప్పుపడుతూ తమను నేతలు పట్టించుకోవడం లేదంటూ తీవ్ర అసంతృప్తిని.. అసహనాన్ని వ్యక్తం చేశారు. ఏడాదిన్నర గడిచినా పదవులు దక్కడం లేదంటూ వాపోయారు. పార్టీ అధికారంలో ప్రాధాన్యత లేకుండా పోయిందని నిరాశను వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ అసెంబ్లీ ఇన్ చార్జి పురుమల్ల శ్రీనివాస్ చేసిన సంచలన ఆరోపణలు సమావేశంలో మరింత వేడిని రాజేసింది. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా వైద్యుల అంజనీకుమార్ పేరును తాను సిఫార్సు చేశానని.. అనేక దేవాలయాలకు కమిటీలను నియమిస్తూ లేఖలు కూడా పంపానని వెల్లడించారు. అయితే ఒకరిద్దరు నేతలు అక్కడ తన లెటర్లకు ఆమోదం పడకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గతంలో పార్టీని భ్రష్టు పట్టించిన వారే ఇప్పుడు కూడా అదే పనిలో ఉన్నారంటూ ధ్వజమెత్తారు.

# అక్కడ వాళ్ళే.. ఇక్కడ వాళ్ళకేనా..?

- పార్టీలు మారిన వారికే ప్రాధాన్యతలా...
- గుర్తింపు కరువై అల్లాడుతున్నాం...
- పరిశీలకుల సమక్షంలో కార్యకర్తల గోడు...




3

(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)
పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తున్న సీనియర్ కార్యకర్తలకు ప్రాధాన్యత కరువైందని పలువురు నాయకులు, కార్యకర్తలు వాపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారం అనుభవించి అడ్డగోలు ఆస్తులు సంపాదించుకొని తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేరిన వారికే ప్రాధాన్యతనివ్వడం దేనికి సంకేతమని వారు ప్రశ్నించారు. పార్టీ జెండాను మోస్తున్న వారికి ఏడాదిన్నర గడిచినా గుర్తింపు దక్కకపోవడం అన్యాయమని వారు తమ ఆక్రోశాన్ని వెల్లగక్కారు. కరీంనగర్ డిసిసి కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్ పెరుమాళ్ హాజరు కాగా రాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్, రఘునాథ్ రెడ్డి, శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, నియోజకవర్గ ఇన్ చార్జిలు పురుమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్ బాబు, మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం, ఆరెపల్లి మోహన్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పొన్నం.. బస్సులను అడ్డుకుంటావా..?

- బెదిరించినా బీఆర్ఎస్‌కే అండదండలు
- సభ ఫెయిలైందంటూ పైశాచికత్వం.. సగం మందితో సభ పెట్టే దమ్ముందా
- మాజీ మంత్రి గంగుల సవాల్

4





కరీంనగర్ బోయవాడలో నిరుపేద కుటుంబమైన రవళి రాజు పెళ్లి సందర్భంగా సహాయం కోసం మేము సైతం యువసేన ఫౌండేషన్, కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా సంఘం ఆధ్వర్యంలో పుస్తె, మట్టెలు, చీరే, గాజులు అందించారు. ఈ కార్యక్రమం దాతల సహకారంతో చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్, రమాదేవి, లక్ష్మి, లత పాల్గొన్నారు.



## చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** వీణవంక మండలం చల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఇక్కడి ఓపి రికార్డును తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి ఆస్పత్రికి వచ్చిన కారణాన్ని తెలుసుకున్నారు. ఫిమేల్ వార్డు సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న గర్భిణీతో మాట్లాడారు. సాధారణ ప్రసవం గురించి అవగాహన కల్పించారు. గర్భిణీ ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల ఆధార్, ఫోన్ నెంబర్ సేకరించి ఆయుష్మాన్ భారత్ లో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని అన్నారు. బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన మాత్రలు నిరంతరం అందుబాటులో ఉంచాలని అన్నారు. మహిళలకు మల్టీ విటమిన్ టాబ్లెట్లు, క్యాల్షియం ఐరన్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. టెలివిజన్లో అవగాహన కార్యక్రమాలు ప్రదర్శించాలని సూచించారు. కలెక్టర్ వెంట పిహెచ్సి వైద్యురాలు డాక్టర్ సుచిత్ర ఉన్నారు.



## అఖిల భారతీయ స్వర్ణకార సంఘ్ కు ఎంపిక

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో ఆదివారం జరిగిన అఖిల భారతీయ స్వర్ణకార్ సంఘ్ జాతీయ శాఖ అధ్యక్షులు యశ్పాల్ చౌహన్ అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి రవివర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పధాధికారులచే ప్రమాణ స్వీకారమహోత్సవంలో స్వర్ణకార సంఘం సౌత్ ఇండియా ఇన్చార్జి జల్లపల్లి పెంటయ్య చారి సమక్షంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు వింజమూరి రాఘవాచారి, ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి ప్రతిపాదనలో ఉమ్మడి జిల్లా నుండి బ్రహ్మశ్రీ కందుకూరి పూర్ణాచారి జాయింట్ సెక్రెటరీగా, బ్రహ్మశ్రీ శ్రీరామోజు రవీంద్ర చారి జాతీయ మెంబర్గా ఎన్నికయ్యారు.

# రసాభాస

- పొన్నంను టార్గెట్ చేసిన పురుమల్ల
- అడ్డుకున్న పొన్నం అనుచరులు
- తీవ్ర వాగ్వాదం.. తోపులాటతో గందరగోళం..
- ఏఐసీసీ నేత సమక్షంలోనే వివాదం



(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)

***అరుపులు.. కేకలు.. తోపులాటలు.. బండ బూతులు.. పరస్పర విమర్శలు.. ప్రతి విమర్శలు.. సవాళ్ళు.. ప్రతి సవాళ్ళు.. ఇది జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా భావిం చిన సంస్థాగత ఎన్నికల నిర్వహణ కోసం సోమవారం ఏర్పాటు చేసిన సమావేశం జరిగిన తీరు. సాక్షాత్తు ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్ చార్జి విశ్వనాథన్ సమక్షం లోనే కాంగ్రెస్ పార్టీ గ్రూపు రాజకీయాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ పై కరీంనగర్ అసెంబ్లీ ఇన్ చార్జి పురుమల్ల శ్రీనివాస్ మరోసారి పేరు ప్రస్తా వించకుండా పరోక్షంగా వివాదాస్పద వ్యాఖ్య లు చేయడం వివాదానికి దారి తీసింది. ఒకటికి నాలుగు సార్లు తనదైన శైలిలో పొన్నంపై ఆరోపణలు గుప్పిస్తుండటంతో జీర్ణించుకోలేని పొన్నం అనుచరులు పెద్ద ఎత్తున పురుమల్లపై దాడికి దిగేందుకు సిద్ధం కావడంతో సమావేశం రసాభాసగా మారిం ది. నేతలు, కార్యకర్తల మధ్య అరుపులు, కేక లు వెరసి తోపులాటకు దారి తీసింది. సుమా రు రెండు గంటల పాటు ఏం జరుగుతున్న దో కూడా ఎవరికీ అర్థం కాకుండా పోయింది.***

పార్టీ సంస్థాగత నిర్మాణ ప్రక్రియలో భాగంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం రసాభాసగా మారింది. గ్రామ, మండల, బ్లాక్, జిల్లా పార్టీ అధ్యక్ష ఎన్నికకు సంబంధించి సూచనలు, సలహాలు అందించాల్సిన సమావేశం ఆద్యంతం దారి తప్పింది. పలువురు నేతలు పార్టీ నాయకత్వ తీరును తప్పుపడుతూ తమను నేతలు పట్టించుకోవడం లేదంటూ తీవ్ర అసంతృప్తిని.. అసహనాన్ని వ్యక్తం చేశారు. ఏడాదిన్నర గడిచినా పదవులు దక్కడం లేదంటూ వాపోయారు. పార్టీ అధికారంలో ప్రాధాన్యత లేకుండా పోయిందని నిరాశను వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ అసెంబ్లీ ఇన్ చార్జి పురుమల్ల శ్రీనివాస్ చేసిన సంచలన ఆరోపణలు సమావేశంలో మరింత వేడిని రాజేసింది. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా వైద్యుల అంజనీకుమార్ పేరును తాను సిఫార్సు చేశానని.. అనేక దేవాలయాలకు కమిటీలను నియమిస్తూ లేఖలు కూడా పంపానని వెల్లడించారు. అయితే ఒకరిద్దరు నేతలు అక్కడ తన లెటర్లకు ఆమోదం పడకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గతంలో పార్టీని భ్రష్టు పట్టించిన వారే ఇప్పుడు కూడా అదే పనిలో ఉన్నారంటూ ధ్వజమెత్తారు. తాను లెటర్ ఇచ్చి ఏడాది దాటిందని.. కమిటీలు వేస్తే మరో ఆరు మాసాల్లో మరికొందరికి కూడా పదవులు దక్కేవంటూ పురుమల్ల తన అక్కసును వెల్లగక్కారు. ఒక దుర్మార్గుడు కావాలనే అడ్డుకుంటున్నారంటూ పదేపదే పురుమల్ల ప్రస్తావించారు. పార్టీలో సీనియర్ అయిన అంజన్ కుమార్ ఆ పదవికి అర్హుడు కాదా అంటూ పురుమల్ల ప్రశ్నించారు.

### పొన్నం వర్గీయుల అభ్యంతరం...

పురుమల్ల మాట్లాడుతున్న తీరును గమనించిన పొన్నం అనుచరులు పడాల రాహుల్, బోనాల శ్రీనివాస్ తదితరులు ఒక్కసారిగా లేచి నిలబడి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎవరిని ఉద్దేశించి మాట్లాడుతున్నావంటూ నిలదీశారు. దీనికి కౌంటర్ గా పురుమల్ల మాట్లాడే ప్రయత్నం చేస్తుండగా.. పొన్నం అనుచరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒక్కసారిగా వేదికపైకి చేరుకున్నారు. పురుమల్ల అనుచరులు ఆయన చుట్టూ బారికేడ్ లా రక్షణగా నిలువగా.. పొన్నం అనుచరులు వేదికపైకి దూసుకురావడం మొదలుపెట్టారు. దీంతో వేదిక కింద కంటే మీదనే ఎక్కువ మంది నేతలు చేరుకోవడం మరింత గందరగోళానికి దారి తీసింది.

### అరుపులు.. కేకలు..

పొన్నం అనుచరులు పురుమల్లను చుట్టుముట్టే యత్నం చేయగా.. పురుమల్ల అనుచరులు గట్టిగా అడ్డుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ను కావాలని బదనాం చేస్తున్నారంటూ పడాల రాహుల్, బోనాల శ్రీనివాస్ తదితరులు అక్కడే ఉన్న డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి కూడా తీసుకువెళ్ళారు. ఇరువైపులా అరుపులు, కేకలు, తోపులాట మినహాయిస్తే వేదిక మీద ఏం జరుగుతున్నదో కూడా తెలియకుండా పోయింది. నేతలందరూ అటు ఇటుగా తిరుగుతూ మరింత గందరగోళాన్ని సృష్టించారు.

### జారుకున్న నేతలు..

వివాదం మొదలవుతుండటం గమనించిన నేతలందరూ మెల్లగా డీసీసీ అధ్యక్షుని ఛాంబర్ లోకి చేరుకున్నారు. వివాదాన్ని సద్దుమణిగించే బాధ్యత డీసీసీ అధ్యక్షునికి అప్పగించి మిగతా నేతలంతా సైలెంట్ గా ఉండిపోయారు. పలువురు సీనియర్ నేతలు వేదిక వద్ద ఉన్నా కూడా ఎవరూ జోక్యం చేసుకునేందుకు ఆసక్తి చూపక పోవడం గమనార్హం. ఒక్క డీసీసీ అధ్యక్షుడు మాత్రమే మైక్ పట్టుకొని వేదిక మీద ఉన్న వారందరినీ కిందికి పంపించే ప్రయత్నం చేస్తుండగా.. అంతకు రెట్టింపుగా కార్యకర్తలు వేదిక మీదకు చేరుతుండటంతో ఆయన కూడా చేతులెత్తేయక తప్పలేదు. అరుపులు, కేకలు, తోపులాటలతో కార్యకర్తలే చివరకు అలసిపోయి సైలెంట్ కావల్సి వచ్చింది. దీంతో తిరిగి నేతలందరూ వేదిక మీదకు రాగానే సమావేశం నిర్వహించారు.

### మళ్ళీ తోపులాట..

సమావేశం ముగిసిన తర్వాత నేతలందరూ బయటకు వస్తుండగా.. అప్పుడే అక్కడకు చేరుకున్న పురుమల్ల అనుచరులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ లోనికి వచ్చే ప్రయత్నం చేయడం మరోమారు తోపులాటకు దారి తీసింది. ఇరు వర్గాల మధ్య అరుపులు, కేకలు, ఆరోపణలు, విమర్శలు, తోపులాటతో మరికొంత సమయం గడిచింది. దీంతో పోలీసులు కూడా జోక్యం చేసుకొని ఇరు వర్గాలను పక్కకు నెట్టాల్సి వచ్చింది. సీఐ సృజన్ రెడ్డి ఇరు వర్గాల మధ్య గొడవ జరగకుండా చర్యలు చేపట్టడంతో పరిస్థితి చక్కబడింది. మొత్తానికి పార్టీ బలోపేతానికి ఉపయోగపడాల్సిన సమావేశం కాస్తా రసాభాసగా మారి పార్టీ గ్రూపు రాజకీయాలకు మరోసారి వేదికగా నిలిచింది.

## అధిష్టానం ఏ బాధ్యతలు అప్పగించినా సమర్థవంతంగా సేవలందిస్తా..

**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ప్రజాసేవయే తన ప్రధాన లక్ష్యమని, తనకు పదవులు, డబ్బులపై ఏమాత్రం మోజు లేదని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు స్పష్టం చేశారు. అధిష్టానం తనకు ఏ బాధ్యత అప్పగించినా సమర్థవంతంగా అధిష్టానానికి వీర విధేయుడుగా పని చేస్తానని పేర్కొన్నారు. తనకు పదవులపై డబ్బులపై ఏమాత్రం మోజు లేదని, కరీంనగర్ ప్రజలే తన కుటుంబమని, తండ్రి జగపతిరావు ప్రజలకు సేవ చేయాలని చేసిన సూచనలు తూచా తప్పకుండా పాటిస్తానని వెల్లడించారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ లోని డీసీసీ కార్యాలయం లో జరిగిన కాంగ్రెస్ పార్టీ సంస్థగత నిర్మాణ సన్నాహక సమావేశానికి వెలిచాల రాజేందర్ రావు హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథన్, కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తో పాటు పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేందర్ మాట్లాడుతూ పూర్వము తన తాత కేశవరావు కరీంనగర్ డిసిసి అధ్యక్షుడిగా పని చేశారని, అదేవిధంగా మా నాన్న జగపతిరావు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పనిచేశారని గుర్తు చేశారు. వారు పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేసే మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. తన తండ్రి జగపతిరావు చేసిన అభివృద్ధి కరీంనగర్ నియోజకవర్గంలో ఏ మూలకు వెళ్లినా కనిపిస్తుందని తెలిపారు. తన తండ్రి జగపతిరావు ఆశయ సాధన మేరకే రాజకీయాల్లో కొనసాగుతున్నానని, కరీంనగర్ ప్రజలకు సేవలు అందిస్తున్నానని చెప్పారు.

# అక్కడ వాళ్ళే.. ఇక్కడ వాళ్ళకేనా..?

- పార్టీలు మారిన వారికే ప్రాధాన్యతలా...
- గుర్తింపు కరువై అల్లాడుతున్నాం...
- పరిశీలకుల సమక్షంలో కార్యకర్తల గోడు...



(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)
పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తున్న సీనియర్ కార్యకర్తలకు ప్రాధాన్యత కరువైందని పలువురు నాయకులు, కార్యకర్తలు వాపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారం అనుభవించి అడ్డగోలు ఆస్తులు సంపాదించుకొని తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేరిన వారికే ప్రాధాన్యతనివ్వడం దేనికి సంకేతమని వారు ప్రశ్నించారు. పార్టీ జెండాను మోస్తున్న వారికి ఏడాదిన్నర గడిచినా గుర్తింపు దక్కకపోవడం అన్యాయమని వారు తమ ఆక్రోశాన్ని వెల్లగక్కారు. కరీంనగర్ డిసిసి కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ సెక్రెటరీ విశ్వనాథన్ పెరుమాళ్ హాజరు కాగా రాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్, రఘునాథ్ రెడ్డి, శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, నియోజకవర్గ ఇన్ చార్జిలు పురుమల్ల శ్రీనివాస్, వొడితెల ప్రణవ్ బాబు, మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం, ఆరెపల్లి మోహన్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు అబ్దుల్ రెహమాన్, కర్ర సత్యప్రసన్న రెడ్డి, అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, శ్రావణ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ పార్టీ కోసం పని చేస్తున్న వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. గత ప్రభుత్వంలో సంపాదించుకొన్న వాళ్లు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ లో చేరి పైరవీలు చేసుకుంటున్నారని ఆరోపించారు. దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్ట పడ్డ కార్యకర్తలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పార్టీ జెండాలు మోస్తున్నారని.. నేతలు పట్టించుకోవడం లేదని వాపోయారు. కష్టపడ్డ నాయకులకు పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల కేటాయింపు విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డిసిసి అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణపై తమకు విశ్వాసం ఉందని ప్రకటించారు.

**డీసీసీ స్థాయిలో క్రమశిక్షణ కమిటీ: నరేందర్ రెడ్డి**

ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి క్రమశిక్షణ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎవరు కార్యక్రమాలకు హాజరుతున్నారు, ఏ కార్యక్రమాలు చేపడుతున్నాం అనే విషయమై గల్లీ నుండి ఢిల్లీ వరకు సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలని సూచించారు. నాయకులు విభేదాలు పక్కన పెట్టి పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని..కార్యకర్తలను సమాయత్తం చేయాలని సూచించారు. పురుమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పదవుల విషయంలో.. ప్రాధాన్యత విషయంలో కార్యకర్తల్లో చాలా ఆవేదన ఉందన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీనీ భ్రష్టు పట్టించడానికి ఒకరిద్దరు నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న నామినేటెడ్ పదవులు వెంటనే భర్తీ చేస్తే కొంతమంది కార్యర్తలు సమాజంలో గౌరవంగా బ్రతుకుతారన్నారు.

**పదవులకు ఎవరైనా దరఖాస్తు: నమిండ్ల శ్రీనివాస్**

2017కు ముందు నుంచి పార్టీ కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు ఎవరైనా పార్టీ పదవుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. దేశానికి స్వాతంత్రం తెచ్చిన, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ లో సభ్యులుగా మనము గర్వ పడాలన్నారు. పార్టీ బాగుంటేనే పదవులు వస్తాయని స్పష్టం చేశారు. గ్రామ, మండల, బ్లాక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా పదవి ఆశించే వాళ్ళు దరఖాస్తు చేసుకోవచ్చని... ప్రతి విభాగం నుండి కనీసం ఐదుగురు సభ్యులు కంటే మించి దరఖాస్తులు సమర్పించాలన్నారు. నియోజకవర్గస్థాయి సమావేశాలు ఏర్పాటు చేసి తాము దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పార్టీ మారిన వివరాలు కూడా పొందుపరచాలని సూచించారు. మండల స్థాయిలో గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తామని... సంస్థాగత బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాన్ని తీసుకుంటామన్నారు. ఇన్చార్జిగా వేసిన నేతలు గాంధీభవన్ మీటింగుకు హాజరు కాకపోతే తొలగించడం జరుగుతుందన్నారు. పార్టీలో ప్రతి విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ఎవరో కొత్తగా పార్టీ మారి తిరిగి వచ్చినా ఎవరి స్థానం వారికి ఉంటుందని... అధిష్టానం వారికి సహకారం అందిస్తుందన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎవరు ఎవరితో ఉన్నా అందరూ పార్టీ కోసం కష్టపడ్డ వారేనన్నారు. నాయకుల మధ్య విభేదాలతో కార్యకర్తలు నష్టపోకుండా చూడాలని సూచించారు. వెలిచాల రాజేందర్ రావు గారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని... ఆ పార్టీ అధికారంలోకి రాదనే పరిస్థితుల నుండి అధికారంలోకి తీసుకురావడం కోసం పనిచేసిన వారందరికీ సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీతో తనది సుదీర్ఘ ప్రయాణం అని...రాష్ట్ర ప్రభుత్వం ప్రమాణం చేసిన నాటి నుండి కార్యకర్తలు పదవుల కోసం ఎంతో ఆశగా ఉన్నారన్నారు.

**పార్టీకి నష్టం చేకూరిస్తే చర్యలు తప్పవు: ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్**

పార్టీ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఎవరు వ్యవహరించినా చర్యలు తప్పవని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్ చార్జి, మాజీ ఎంపీ విశ్వనాథన్ పెరుమాళ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ చరిత్ర కలిగి ఉన్న పార్టీ అని... పార్టీ సూచించిన గీతను ఎవరు దాటినా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. జాతీయ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే స్వయంగా చెప్పారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో బలమైన నేత ముఖ్యమంత్రిగా.. మరో నేత పీసీసీ అధ్యక్షులుగా ఉన్నారని ఆయన అభినందించారు. రాష్ట్రం గురించి రాహుల్ గాంధీ చాలా గొప్పగా చెప్పారని.. అంతటి ప్రాధాన్యత ఇచ్చిన ఈ రాష్ట్రం అన్నింటా ముందంజలో నిలిచి పేరును కాపాడుకోవాలని సూచించారు. పార్టీకి సంబంధించిన ఏ అంశమైనా పార్టీ వేదిక మాత్రమే చర్చించాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో పార్టీకి నష్టం జరిగే విధంగా ఎవరైతే ప్రయత్నిస్తారో చూస్తూ నాయకత్వం ఊరుకునేది లేదన్నారు. పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యానికి భిన్నంగా వ్యవహరించడమంటే రామాయాణంలో లక్ష్మణ రేఖను దాటిన సీతలా మారడమే అవుతుందని ఆయన హెచ్చరించారు. తమకు కావలసిన అవకాశాల గురించి ... పదవుల గురించి నాయకులను కలిసి వినతి పత్రం ద్వారా కోరే స్వేచ్ఛ కాంగ్రెస్ పార్టీలో ఉందన్నారు. గ్రామస్థాయి అధ్యక్ష పదవి నుండి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి వరకు ఒక పద్ధతి ప్రకారం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుందని ఆయన వివర్శించారు. తనకు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమని.. ఏనాడూ పదవులు కావాలని కోరుకోలేదని.. అధిష్టానం అవకాశం ఇవ్వడం వల్లే ఒకసారి ఎంపీగా గెలిచానని గుర్తు చేశారు. పార్టీ కార్యకర్తలందరూ ఐక్యమత్యంగా ఉండి ప్రజాక్షేత్రంలో నిలువాలని ఆయన పిలుపునిచ్చారు.

## రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం కోసం జిల్లాలో 57,763 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. ప్రత్యేక అధికారులు దరఖాస్తుల విచారణను వేగవంతం చేయాలని అన్నారు. బ్యాంకుల నుండి ఏవైనా సమస్యలు



ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి పవన్ కుమార్, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



## కరీంనగర్ బస్టాండ్‌లో పోలీస్ ఔట్ పోస్ట్ ప్రారంభం

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** వేసవి సెలవుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, కరీంనగర్ బస్టాండ్‌లో చోటుచేసుకునే దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టేందుకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు సోమవారం ఒక పోలీస్ ఔట్‌పోస్ట్‌ను ప్రారంభించింది. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఈ ఔట్‌పోస్ట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, బస్టాండ్‌లో ప్రయాణికులకు ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడానికి, ముఖ్యంగా దొంగతనాల నియంత్రణకు ఈ అవుట్‌పోస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికే బస్టాండ్ ఆవరణలో ఉన్న 45 సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని ఆయన తెలిపారు. భవిష్యత్తులో అవసరమైన ప్రాంతాల్లో మరో 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరినట్లు వెల్లడించారు. ఈ పోలీస్ అవుట్‌పోస్ట్‌లో 24 గంటల పాటు పోలీసు అధికారులు మరియు సిబ్బంది అందుబాటులో ఉంటారని కమిషనర్ తెలిపారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే ఈ అవుట్‌పోస్ట్‌ను సంప్రదించవచ్చని ఆయన సూచించారు. అంతేకాకుండా, జేబు దొంగల చిత్రాలను ప్రజలకు కనిపించేలా ప్రత్యేక బోర్డులపై ప్రదర్శిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఎస్సై రాజన్న, ఆర్టీసీ అధికారులు ఎస్ భూపతి రెడ్డి (డిప్యూటీ రీజనల్ మేనేజర్, ఆపరేషన్స్, కరీంనగర్ రీజియన్), డిపో మేనేజర్‌లు విజయ మాధురి, శ్రీనివాస్, బస్టాండ్ ఏటీఎం జి సురేష్, కార్గో మేనేజర్ రామారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ సమావేశంలో సాగర్

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** భారత ప్రభుత్వ జాతీయ యువజన, క్రీడా సర్వీసుల విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 25, 26వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన ఎన్ఎస్ఎస్ జాతీయ సమావేశంలో స్థానిక వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుండి ముగ్గురు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులకు ఆహ్వానం అందగా అందులో మా కళాశాల ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ పాల్గొనడం జరిగింది. ఇది సాగర్ చేస్తున్నటువంటి సామాజిక సేవకు గుర్తింపుగా నేను భావిస్తున్నాను. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ఈ సమావేశంలో "మై భారత్" పోర్టల్ గురించి నా ఆలోచనలను, ఆ ఆలోచనలకు అనుసరించే పద్ధతులను వారికి వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ రోజు కళాశాల లో జరిగిన కార్యక్రమంలో ధనపురి సాగర్ ను కళాశాల కరస్పాండెంట్ శ్రీ వి. ఆగంరావు ,ఏ.సి.ఓ బి.సంపత్ కుమార్,ఏ.వో బి.శ్రవణ్ కుమార్, రామేశ్వర్ రావు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.



## పేదల పక్షాన పోరాడే పార్టీ సిపిఐ

**రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి**

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 13 వ మండల మహాసభ పిట్టల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, ఏఐటీయుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య హాజరయ్యారు. అనంతరం కేదారి గారు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలలో గ్రామ శాఖలు ఏర్పాటు చేసుకొని శాఖ కార్యదర్శిలను ఎన్నుకుంటూ కమిటీలు వేయడం జరిగింది అనంతరం తిమ్మాపూర్ మండలం మహాసభ ఏర్పాటు చేసి మండల కార్యదర్శిగా బోయిని తిరుపతి సహాయ కార్యదర్శిగా సూరం మల్లేశం కోశాధికారిగా పార్నంది రాజకుమారులను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంతాల తిరుపతిరెడ్డి, పిట్టల తిరుపతి, గూడెపూ రమేష్, మేకల కుమార్, మేకల శ్రీనివాస్, ఎల్లస్వామి కొలిపాక, రమేష్, వంగల భాస్కర్ రెడ్డి, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.



## కేసీఆర్ పాలనలో అన్నివ్యవస్థలు నిర్వీర్యం

**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని రంగాలు, వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. సోమవారం మానకొండూర్ మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు,వ్యవస్థలను బలోపేతం చేయడానికి ఏ మాత్రం పాటుపడకుండా గత పాలకులు పూర్తిగా నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. ఆర్టీసీ ని ప్రైవేటుపరం చేసి దాని ఆస్తులు కాజేసేందుకు గులాబీ నేతలు ప్రయత్నం చేశారని ఆరోపించారు. పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం చూసి తట్టుకోలేక బాధతో కేసీఆర్ తల్లడిల్లుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వ్యంగ్యంగా విమర్శించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ వేదికగా కేసీఆర్ కాంగ్రెస్ ప్రజా పాలనపై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రఖండించారు. కేసీఆర్ మాయ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ మండల అభివృద్ధి అధికారి వరలక్ష్మి, తహసీల్దార్ రాజేశ్వరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, రామిడి తిరుమల్ రెడ్డి, కోండ్ల సురేష్, బుర్ర శ్రీధర్ గౌడ్, కనకం అశోక్, సాయిరి దేవయ్య, తిరుపతిరెడ్డి, ఎగ్గోళం శ్రీనివాస్ గౌడ్, గొల్లెన కొమురయ్య, మల్లికార్జున్, కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పొన్నం.. బస్సులను అడ్డుకుంటావా..?



- బెదిరించినా బీఆర్ఎస్ కే అండదండలు
- సభ ఫెయిలైందంటూ పైశాచికత్వం
- సగం మందితో సభ పెట్టే దమ్ముందా
- మాజీ మంత్రి గంగుల కమలాకర్ సవాల్

**(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)**

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీఆర్ఎస్ సభకు బస్సులు ఇవ్వకుండా ఆర్టీఏ అధికారుల ద్వారా మెసెజ్ లు పంపించి ఒత్తిడి తీసుకువచ్చారని బీఆర్ఎస్ మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. బస్సు పంపితే లక్ష రూపాయల జరిమానా విధిస్తామని బెదిరించినా కూడా యాజమాన్యాలు మూకుమ్మడిగా తమకు అండగా ఉంటామని చాటి చెప్పాయని స్పష్టం చేశారు. మంత్రిగా పొన్నం ప్రభాకర్ సిగ్గుపడాలని.. తలవంచుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దమ్ముంటే అదే ప్రాంతంలో తమకు హాజరైన జనంలో సగం మందితో కాంగ్రెస్ పార్టీ సక్సెస్ సభ నిర్వహించాలని గంగుల మంత్రి పొన్నంకు సవాల్ విసిరారు. తాము అధికారంలో లేమని.. స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చి కేసీఆర్ కు అండగా ఉంటామని భరోసానివ్వడంతో బెంబేలెత్తిన మంత్రులు అడ్డగోలు మాట్లాడారని ఆయన మండిపడ్డారు. సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తో కలిసి కరీంనగర్ లో గంగుల కమలాకర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ ప్రపంచం నివ్వెరపోయేలా ఎల్కతుర్తి సభ జరిగిందన్నారు. అధికారంలో లేకున్నా మహిళల పాత్ర లేకున్నా పెద్ద ఎత్తున రావడం బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో ఉన్న ప్రేమకు అద్దం పడుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ 15 నెలల్లోనే విధ్వంసం సృష్టించడం వల్లే ప్రజలు బీఆర్ఎస్ పాలనను కోరుకుంటూ మద్దతునిచ్చేందుకు వచ్చారన్నారు. సభ విజయవంతం కావడంతో వెంటనే ముగ్గురు మంత్రులు ఉలిక్కిపడ్డారని గంగుల ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన నాడు.. ఉద్యమం జరిగిన నాడు మంత్రి పొంగులేటి వైఎస్ఆర్ పార్టీలో ఉండగా...మరో మంత్రి సీతక్క టీడీపీ పార్టీలో ఉన్నారన్నారు. సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చిన రోజు కూడా మంత్రులు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారా అని ఆయన నిలదీశారు.

### పొన్నం.. అక్కడే మీటింగు పెట్టు..

బీఆర్ఎస్ సభ విఫలమైందంటూ మంత్రి పొన్నం రెచ్చిపోయారని గంగుల విమర్శించారు. అధికార పార్టీ వైఫల్యం మీద తాము సభ నిర్వహించామని.. చేతనైతే అదే చోట అందులో సగం మందితో కాంగ్రెస్ పార్టీ సక్సెస్ మీటింగు నిర్వహించాలని ఆయన సవాల్ విసిరారు. ఒక వేళ సభ జరిగితే హాజరైన జనం నుంచి తప్పించుకొని బయటకు రాగలుగుతారా.. ఇచ్చిన హామీల అమలును అడగకుండా ఉంటారా అని



ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ అడిగితే ప్రజల నుంచి వచ్చిన స్పందనను గమనించారా అని ఆయన ప్రశ్నించారు. సభ జరగకుండా తీవ్ర నిర్బంధం అమలు చేశారని.. సభ ముగిసాక కూడా 3.30 గంటలు నిలబెట్టారని ఆయన మండిపడ్డారు. ఎందుకు ఇంత పైశాచికత్వం అని ప్రశ్నించారు. ఒక లారీని అడ్డం పెట్టి ట్రాఫిక్ జాం చేశారని.. విషం నింపుకున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన మండిపడ్డారు. సభలో కేసీఆర్ ఎవరిని ఒక్క మాట అనలేదని స్పష్టం చేశారు.

### కాంగ్రెస్ మెడలు వంచి తెచ్చుకున్నాం..

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వల్లే వచ్చిందంటూ మంత్రుల వ్యాఖ్యలను గంగుల ఖండించారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెచ్చుకున్నామని.. కేసీఆర్ పోరాటం వల్ల తెలంగాణ వచ్చిందే తప్ప కాంగ్రెస్ ఇచ్చిందేమీ లేదని గంగుల తేల్చిచెప్పారు. తెలంగాణ సమాజం ఏకం కావడంతో తప్పదని ఇచ్చారని.. ఆ క్రెడిట్ తమ పార్టీదేనని స్పష్టం చేశారు. సభ విజయవంతం కాంగ్రెస్ వైఫల్యాలకు నాంది అని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ఆయన సూచించారు. సభకు కేసీఆర్ అభిమానులే వచ్చారన్నారు. ఇక నుంచి అయినా తమ గురించి కాకుండా ప్రజల గురించి పట్టించుకోవాలని సూచించారు. రేషన్ కార్డులు ఇప్పటి వరకు ఇవ్వడం లేదని ప్రజలు మొర పెట్టుకుంటున్నారని.. వారి సమస్యల పరిష్కారం కోసం చూడాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ఇక నుంచి తాము కూడా నిలదీస్తామని..వెంబడి పడతామని.. ప్రజల పక్షాన పోరాటం చేస్తామని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు.

### కాంగ్రెస్ జీర్ణించుకోవడం లేదు: కొప్పుల

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ఎల్కతుర్తి సభ విజయవంతమైందన్నారు. ఒక వెల్లువలా సాగిన సభ అని గుర్తు చేశారు. ప్రజల ఉత్సాహం చూస్తుంటే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉన్నదో కనబరచడానికి ప్రతీ గ్రామం నుంచి అన్ని ప్రాంతాల నుంచి కదలి



వచ్చారన్నారు. గులాబీమయమై పండగ వాతావరణం కనిపించిందన్నారు. 25వ యేట అడుగుపెడుతున్న సందర్భంగా కేసీఆర్ నిర్ణయం మేరకు జరిగిన సభ ఇది అని అన్నారు. లక్షలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. సభ విజయవంతం కావడంతో జీర్ణించుకోలేక అక్కసును వెళ్ళగక్కుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీని ప్రజల సమక్షంలోనే ప్రశ్నించడంలో తప్పు ఏముందో చెప్పాలని ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఏదో కోల్పోయినట్టు ఆదరబాదరగా సమావేశమై రజతోత్సవ సభను తప్పుపట్టే ప్రయత్నం చేయడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ ప్రజల పాలిట విలన్ కాంగ్రెస్ పార్టీయేనని కేసీఆర్ చెప్పిన మాట నిజమేనన్నారు. తొలి దశ ఉద్యమంలో.. మలి దశ ఉద్యమంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయినా.. చివరకు కేసీఆర్ ప్రాణత్యాగానికి సిద్ధమైన తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో తెలంగాణ ను ప్రకటించాల్సి వచ్చిందని ఈశ్వర్ స్పష్టం చేశారు.

### మంత్రులకు మతి భ్రమించింది: సుంకె

చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ తమ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు సభకు హాజరైనందుకు ధన్యవాదాలు తెలిపారు. ఒక జాతరను, కుంభమేళాను తలపించిందన్నారు. కేసీఆర్ కు అండగా ఉంటామని.. ఆయన వల్లే తమకు మేలు జరుగుతుందనే భరోసా ఇచ్చేందుకే జనం తరలివచ్చారన్నారు. మంత్రులకు మతి భ్రమించిపోయి ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. అట్టర్ ఫ్లాప్ ప్రభుత్వం ఏదైనా ఉంటే కాంగ్రెస్ సర్కారు మాత్రమేనని ఆరోపించారు. చేతనైతే ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక తమ సభ విఫలమైందనడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో నాయకులు ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్ రావు, చల్లా హరిశంకర్, రవీందర్ రెడ్డి, అనిల్ కుమార్, రుద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.




# నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** నగరంలో రాజ్యాంగ పరిరక్షణ ముగింపు పాదయాత్ర నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీగా నిర్వహించారు. ఈ పాదయాత్రలో ఏఐసిసి కార్యదర్శి విశ్వనాథన్ మరియు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. మహాత్మా గాంధీ, అంబేద్కర్ యొక్క ప్రాధాన్యత తగ్గించే విధంగా బిజెపి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని వారు ఈ దేశ స్వాతంత్ర్యం పోరాటం చేసి అనంతరం దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహానుభావులని కొనియాడారు. మార్కెట్ వెంకటేశ్వర దేవాలయం నుండి ప్రారంభమైన భారీ పాదయాత్ర టవర్ సర్కిల్ మీదుగా రాజీవ్ చౌక్ నుండి గాంధీ రోడ్డు లోని గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నియోజక వర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్,కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్,రుద్ర సంతోష్,వెలిచాల రాజేందర్ రావు,ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి,కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,ఎండి తాజ్,కొరివి అరుణ్ కుమార్,శ్రవణ్ నాయక్ మాజీ కార్పొరేటర్లు సిటీ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సాదాబైనమా దరఖాస్తులకు మోక్షం

**భూ భారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా పెండింగ్లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులకు మోక్షం కలగనుందని, రైతుల భూ సమస్యలు పరిష్కారం కానున్నాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం వీణవంక మండలం చల్లూరులోని రైతువేదికలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం 2025 రూపొందించిందని తెలిపారు. భూ భారతి చట్టం ప్రకారం సమస్యను సంబంధిత అధికారి ఎన్ని రోజులలో పరిష్కరించాలనే విషయమై స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని తెలిపారు. అధికారి పరిష్కరించిన భూ సమస్యపై సంబంధిత అర్జీదారు సంతృప్తి చెందని పక్షంలో అప్పీలు వ్యవస్థను ఈ చట్టంలో పొందుపరిచారని తెలిపారు. కోర్టుకు వెళ్లే అవసరం లేకుండా జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్ అధికారికి, కలెక్టర్‌కు అధికారాలు కల్పించారని తెలిపారు. భూ భారతి చట్టం పై ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి రమేష బాబు, తహసిల్దార్ శ్రీనివాస్, వివిధ వర్గాల ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



**పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నిరసనగా కమాన్ చౌరస్తాలో కమాన్ చౌరస్తా వ్యాపారులు, యువకులు క్యాండిల్స్‌తో నివాళి అర్పించారు. ఉగ్రవాదలు జరిపిన దాడిలో అమాయక టూరిస్టులు చనిపోయారని, కొందరు గాయపడ్డారని, వారు తొందరగా కోలుకోవాలని కోరారు. చనిపోయిన కుటుంబాలకు అందరం అండగా ఉండాలని, ఉగ్రవాదులను పొంచి పోషిస్తున్న ఉగ్రవాద సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నివాళి అర్పించారు. చనిపోయిన టూరిస్టులకు వాళ్ళ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కమాన్ చౌరస్తాలో క్యాండిల్స్ వెలిగించి ఉగ్రవాదులను శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుచున్నాము ఈ కార్యక్రమంలో కమాన్ చౌరస్తా యూత్ అసోసియేషన్ పాల్గొన్నారు.**




## పోచంపల్లి బాలికలకు అభినందన

**మానకొండూర్, ఎలగందల్ టైమ్స్:** ఇటీవల వెల్లడించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించిన మానకొండూర్ మండలం పోచంపల్లి గ్రామంలోని మోడల్ స్కూల్ విద్యార్థినులు పిల్లి అంజలి, బాకారపు రక్షితలను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సోమవారం ఎల్.ఎం.డీ కాలనీలో క్యాంపు కార్యాలయానికి వచ్చిన అంజలి, రక్షితలు ర్యాంకులు సాధించడంపై ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్ హర్షం వ్యక్తం చేస్తూ సదరు బాలికలను అభినందించారు. వేర్వేరు గ్రూపుల్లో అంజలి 500 మార్కులకుగాను 492, రక్షిత 440 మార్కులకు గాను 434 మార్కులు సాధించడం సంతోషకరమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. కష్టపడి చదివి మరింత ఉత్తమ ఫలితాలు సాధించాలని, తద్వారా భవిష్యత్ లో ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, గన్నేరువరం, ఇల్లంతకుంట మండల పార్టీ అధ్యక్షులు ముస్కు ఉపేందర్ రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకులు కోంద్ర సురేష్, శ్రీనివాస్ గౌడ్, కొమ్మెర రవీందర్ రెడ్డి, మాచర్ల అంజయ్య, కొత్త తిరుపతిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, ఇంచార్జీలు బి.శ్రీనివాస్, తిరుపతిగౌడ్, శ్రీరాం శ్రీనివాస్, డాక్టర్ సుమన్ పాల్గొన్నారు.




## బాధిత మహిళలకు సత్వరమే సఖి సేవలు

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ సఖి కేంద్రాన్ని ఆశ్రయించిన బాధిత మహిళలకు సత్వరమే సేవలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి తెలిపారు. సఖి కేంద్రంలో సోమవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం, శక్తి సదన్, సఖి కోఆర్డినేటర్లతో సప్తగిరి కాలనీలోని సఖి కేంద్రంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.డబ్ల్యు.ఓ సరస్వతి మాట్లాడుతూ బాధిత మహిళలు సఖి కేంద్రాన్ని ఆశ్రయించినప్పుడు వారికి ఉచిత న్యాయ, వైద్య, ఆశ్రయ, పోలీసు సేవలను సత్వరమే అందించాలని అన్నారు. అంగన్వాడి, వైద్య సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పది మంది కంటే ఎక్కువగా మహిళలుగా ప్రైవేటు, ప్రభుత్వ పని ప్రదేశాల్లో ఐసిసి కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలకు స్వీయ అభివృద్ధి పథకాలు, ఉచిత శిక్షణలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సఖి అడ్మిన్ లక్ష్మి, డి.హెచ్.ఈ.డబ్ల్యూ కోఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.


గుండె సమస్యలతో బాధపడుతున్నారా
24 గంటల కార్డియాలజీ సేవలు మన కరీంనగర్ లో
ఛాతీ నొప్పి లేదా శ్వాస ఆడకపోవడం
అధిక రక్త పోటు
అధిక కొలెస్ట్రాల్
వికారం , అజీర్ణం & గుండెలో మంట
తల తిరుగున్నట్లు
గొంతు లేదా దవడ నొప్పి
HELPLINE
9985 104 108
కరీంనగర్
సివిల్ హాస్పిటల్ ప్రక్కన
FORTUNE
MEDCARE HOSPITAL
Ray of HOPE